



# ఇప్పుడిక నిశ్చింత

అవసరాల రామకృష్ణారావు

ఎక్జిక్యూటివ్ ఇంజనీరు సాంబమూర్తి అప్పుడే క్యాంపు నుంచి తిరిగొచ్చాడు. ఎంత దూరం నుంచి వస్తేనేం, ఎన్నాళ్ళు పరాయిచోట అలసి సొలసి వస్తేనేం, మనం, దేవాలయానికి వచ్చాం కదా అని లోపలి దేవత గాలిగోపురం దగ్గిరికి వచ్చి మనల్ని ఆహ్వానించదు కదా!

మొగుడికి ఓసారి 'భక్త చూడామణి' అనే ముద్ర పడ్డాక కట్టుకున్న ఏ దేవేరికి మాత్రం ఇటు చూసి పలకరించాలని ఉంటుంది? సాంబమూర్తికి గర్భగుడిలాంటి శయ్యాగారం చేరక తప్పలేదు. పంకజానికి మరింతగా గోడ వైపుకి తిరిగిపోక మార్గమూలేదు.

పంకజానికి పంటికింద అస్తమానూ అలా ఏదో ఆడుతూ ఉండాలి. నిద్రలోకి జారని ఏ కొద్ది సమయమైనా మిగిలితే అది సద్దుబాటు అవడానికి చేత్తో ఏదో చదవని పుస్తకం వుండితీరాలి. అంతే! శరీరం పడుకుని అటూ ఇటూ ఇరవై నాలుగ్గంటలూ దొర్లుతూ ఉంటే కిక్కురుమనకుండా భరించడానికి ఎనిమిదంగుళాల దళసరిగల ఫోమ్‌బెడ్ అమరాలి ఏ లోపమూ రాకుండా ఎన్నెన్ని సౌకర్యాలు సమకూర్చినా, ఏ సందు నుంచో దూరిపోయి టప్ అని కొడితే ధన్ అని ఎగిరిపోయే దోమసహా ఆవిణ్ణి కేర్ చెయ్యక ఇరిటేట్ చెయ్య వచ్చును. బడుగుజీవి. అదెంత దాని




జ్ఞానమనగా ఎంత! క్షణాలమీద క్షమించవచ్చు. కాని జిల్లాకంతటికీ ఆ విభాగంలో అధికారే ముప్పై ఏళ్ళయి పుస్తె కట్టించుకున్న భార్యామణి చూస్తుంటే కనుక్కోవలసిన బాధ్యత మొగుడికి లేదా! సబార్డినేట్స్ ఫోన్ మీద ఫోన్ చేసి ఏ.ఐ.టి. లోనో ఏ ఒన్ రూమ్ బుక్‌చేసుకు వస్తే పరివారమంతా గడగడలాడుతూ భోజన స్నానాది సమస్త సదుపాయాలూ ఏర్పాటు చేస్తే ఇటు జూనియర్‌నీ అటు స్టెనోనీ ఎక్కించుకుని మడత నలగని సూటుతో మెరుపు వదలని కారులో ప్లెజర్ ట్రిప్ కొట్టి రావడమే అలసట అయిపోతే, శరీరమే తప్పు బుర్ర అంటూ ఎదగని ఈ చవట సర్వెంట్స్‌తో ఇంత బంగళాలో ఒక్క ఆడది నెగ్గుకు రావడానికి ఏం పేరు పెట్టాలి!

కొంతసేపు అయ్యాక ఇటు తిరిగి మొగుణ్ణి కోపంగా చూసిన పంకజం చూపులో ఇంత అర్థమూ వుంది. తప్పు చేసిన తలపుతో సాంబమూర్తి ఆ చూపు తట్టుకోలేక తల దించేసుకున్నాడు.

గుమ్మం దగ్గర ట్రేలో రెండు టీలు పట్టుకుని భిక్షాలు నిలబడి వున్నాడు.

'మీ కిష్టమైతే తాగండి. కాదంటే ఇలాగే హరీ మంటానుగాని వాడి చేతి పచ్చి మంచినీళ్ళు ముట్టుకోను.'

పంకజం అటు మరీ గోడకి దగ్గరగా దొర్లిపోయింది. వున్న బంట్రోతుల్లో భిక్షాలదే కాస్త ఆలోచించడం అలవాటైన మెదడు. వాడికి ఈ జన్మలో జవాబు దొరకని ప్రశ్న ఒకటుంది. 'గింత పెద్దబాపు అమ్మోరు [illegible]ంగల ఏమి జూస్కొని గిట్లా కంగారుపడుతున్రి?' అమ్మగారికి బోధపడని విషయం ఒకటుంది. 'ఇంత తింటున్నాడు ఎందుకు తను చెప్పినట్టు అక్షరాలా వినిచావడు!'


వెట్టిచాకిరీ పోయిందన్నారు. కట్టుబానిసతనం రద్దుచేశాం అన్నారు. కాని కైంకర్యంలోనే కైవల్యం ఉందనే విశ్వాసంగల పవిత్రధరిత్రి మనది. 'అన్ని పనులూ మనమే చేసేసుకుంటే పాపం పేదవాళ్ళు వాళ్ళెలా బతుకుతారు!' అనే పరోపకార చింతనని ఏ శాసనాలూ రూపుమాపలేవు. గవర్నమెంటు సర్వీస్‌ప్రసక్తి లేని సామాన్య సంసారాలలో కూడా యీ ఉపకార లక్షణం లక్షణంగా విరాజిల్లడం ఎక్కడపడితే అక్కడే కనిపిస్తుంది. నగలున్నా మొగుడులేని మేనత్తకో, భూములున్నా దిక్కులేని దొడ్డమ్మకో ఇంత నీడపట్టు కల్పించడానికి మనసున్న మనం సందేహించగలమా! ఏ పనీ కల్పించకుండా అవిణ్ణిలా ఉంచేస్తే పాపం బెంగెట్టుకు మతిపోగొట్టుకోదూ! 'ఏదో ఇల్లు కనిపెట్టుకుని రెండు పూటలా నీ చేత్తో నువ్వే వండి పడెయ్యమ్మా!' అంటే ఆ వెర్రితల్లి పొంగిపోదూ! ఇంత ఉపాధి చూపించినట్లు ఉండదూ!

'ఇలాంటి విశ్వమానవప్రేమ చూపించడమే కాబోలు నేను చేసిన తప్పు!' అని ఆశ్చర్యపోతుంది పంకజం మనసు.

ఇంగ్లీషువాడు వెళ్ళిపోయి ఇన్నేళ్ళయినా వాడి దొంగ బుద్ధులూ, దోచుకునే మనస్తత్వం మనం ఇంకా ప్రేమించి పోషిస్తూనే ఉన్నాం. 'ఎంగిలి' అనే మాటకి సరిపడే మాట ఇంగ్లీషులో లేకపోగాక ఎంగిలి బుద్ధులు మాత్రం మన భావాల్లో క్షేమంగా ఉన్నాయి. ఆ దౌర్జన్య జన్య సంప్రదాయాల్లో ముఖ్యమైనది గవర్నమెంటువాడు జీతం ఇస్తే మనం చాకిరీ చేయించుకునే ఫ్యూడలిస్టు పద్ధతి. ఆఫీసులో చేసే నౌకరీకి వేళలంటూ ఉంటాయి. ఇంట్లో చేసే వెట్టిచాకిరీకి అలాంటివి కుదరవు. సాధారణంగా ఆఫీసర్లు కొంత వరకయినా కష్టజీవులు కనక ఆర్డర్లీకి కనీసం టీ నీళ్ళయినా పోయించమని బతిమాలుతారు. సర్వసాధారణంగా వారి పెళ్ళాలు చేసే కంప్లెయింటు మాత్రం ఒకటే. 'అంట్లు తోమే మనిషికి మహాఅయితే నెలకి ఇప్పుడైనా సరే ముప్పై ఇస్తారు. మరి మీ క్లాసు ఫోర్ గాడికి? నాలుగొందలు దొబ్బపెడుతున్నారే అప్పనంగా! ఇది చాలక మనం ఇంకా అలుసు చూపిస్తే వాడు తాడెక్కిపోడూ?' అంటారు. అలాంటి కోమలాంగుల మాలకి కొలికి పూస పంకజం.

'ఒక్కమాట విని చావడంలేదు నౌకరీ చచ్చినాళ్ళు. మీరు ఊళ్ళో లేనప్పుడు నన్ను బొత్తిగా లోకువ కట్టి ఆడిస్తున్నారు. మరి వాళ్ళకి ఎలా భయం చెబుతారో మీరే ఆలోచించాలి. వాళ్ళు నే చెప్పినట్టు వినకపోతే నా బీ. పీ. ఎక్కువయిపోయి ఏ ఎటాక్కో వచ్చి హరీమంటాను. అప్పుడు మీరూ, మీ పరివారమూ హాయిగా ఉండొచ్చు' అంది చీదుకుంటూ.

గవర్నమెంటు సర్వీసులో రూల్సు అనేవి ఎందుకు ఫ్రేం చేశారంటే అవి గుప్తపెట్టుకుని ఆచరణలో పెట్టకుండా వుండేటందుకే. ఆ సంగతి సాంబమూర్తి లాంటి అనుభవజ్ఞులు ఎప్పుడో గ్రహించారు. ఆర్డర్లీ అనబడే ఒకే ఒక నౌకర్ని ఆఫీసరు కేంపుకి వెడితే కూడా వెళ్ళి అన్నీ అమర్చడానికి అదైనా క్లాస్ ఒన్ కేడర్ ఉద్యోగులకు మాత్రమే ప్రభుత్వం ఇస్తుంది. ఆ ప్యూన్ నిర్వర్తించవలసిన విధులు కూడా స్పష్టీకరింపబడి ఉంటాయి. వానలో తడవని వాడూ, ఈ మాత్రం రూలు తెలియని వాడూ ఉండడు. ఇంట్లో అంట్లు తోమడం, వంట చెయ్యడం' బట్టలు ఉతకడం, అయ్యగారికి కాళ్ళ




పట్టడం. (కొండొకచో అమ్మగారికి సహా పుణ్యము హసించుగాక!) ఇలాంటివి ఇంక అన్ని గప్‌చిప్‌గా చేయించుకున్నా ఇన్‌డోర్స్ గనక అంతా ప్రత్యక్షంగా పదిమందికి కంటాపడదు. కాని మనకి తెలిసిన ఏ నౌకరో బాహాటంగా ఏ కూరలో. పాలో, ఇస్త్రీ బట్టలో తెస్తూంటేనో, పిల్లల్ని సైకిలు మీద స్కూళ్ళకి దిగబెట్టి వస్తూంటేనో చూసి ముక్కుమీద వేలేసుకుంటే వాడో ఫూల్ కింద లెక్క. ఎందుకంటే ఎంతటి దోపిడీ అయినా అందరి ఆమోద ముద్రావడి అలవాటుగా మారిపోతే అతి సహజంగా కనిపిస్తుందిగనక. 'మా తాత కట్నం పుచ్చుకున్నాడు. మా నాన్న ఆయన అన్నదమ్ములూ కట్నం పుచ్చుకునే పెళ్ళిళ్ళు చేసుకున్నారు ఈనాడు ఆ సత్సంప్రదాయం గంగలో కలిపి వంశ మర్యాదకి మచ్చ తెమ్మంటారా!' అని ప్రశ్నించినంత మామూలు విషయం ఇది. రోగాలకి సకాలంలో మందు పడకపోతే ఆ బాధపడే మనిషిని చంపేస్తాయని బెంగయినా ఉంటుంది. జబ్బు పడిన సాంఘిక వ్యవస్థలో చెడిపోయేది ఎప్పుడూ కింది వర్గంవాడే. నౌకర్లని ఎంగేజ్ చేసే టెక్నిక్‌లోనే అధికారి పట్టుబడకుండా అనేక అవకాశాలున్నాయి. ఇంతకీ అయ్యగారింట్లో ఎంత వక్కుబాయి చాకిరీ చేసినా నెలయే సరికి ఆఫీసులో జీతం అందుకుంటే అదో రకం 'నీ చాకిరీ చూసి మాకు నచ్చితే ఆఫీసులో ఫ్యూన్ పనికి రికమెండ్ చేస్తాం' అని రోజుకి ఓ కప్పు టీ నీళ్ళూ నెలకి ఓ పదిరూపాయల జీతం లాంటిదీ ముట్టచెప్పి ఏ నాలుగైదేళ్ళో పనివాళ్ళ రక్తం పిండి తీరా ట్రాన్స్‌ఫర్ అయే వేళకి- 'ఇప్పుడు రూల్సు మారిపోయాయి పై డిఠల్లీ ఎవిమిదైనా పాసయితీరాలిట- నేనేం చెయ్యను చెప్పు!' అని కార్మికుణ్ణి వాడి కర్మకి వదిలేసి ఊరుదాటే ప్రబుద్ధులు మీకు చాలా దగ్గర్లోనే ఉన్నారనీ, ఉంటారనీ మీకూ తెలుసు.

ఇంతకీ పనివాళ్ళనుంచి యిలాంటి నిష్కామకర్మ రాబట్టడంలో పంకజానికి గోల్డ్‌మెడల్ ఇవొచ్చు. ముప్పై ఏళ్ళ అనుభవంతో ఈ విద్యలో ఆవిడ శిఖరాగ్రం చేరుకుంది. 'చిన్నప్పుడు మీ పుట్టింట్లో అంట్లు మీరే తోముకునేవారు. ఇప్పుడు స్వయంగా గోక్కోడం కూడా మరచిపోయావు. నడిమంత్రపు సిరికంటె మధ్యలో వచ్చిన హోదా మనిషిని మరింత ఆడిస్తుంది. రేపొద్దున నీ మొగుడు రిటైరు అయితే నీ గతేమిటి? ఈ కారూ, ఈ టెలిఫోనూ, అన్నిటినీ మించి 'అమ్మగారూ!' అంటూ చేతులు కట్టుకు నిలబడే యీ భృత్యవర్గం యివేవీ శాశ్వతం కాదు గదా!' అని ఎవరూ ఆవిణ్ని అడగక్కర్లేదు. శాశ్వతం కాదు కాబట్టే మేగ్జిమం రాబట్టదల్చుకున్నాను. ఇంకా ఐదారేళ్ళే ఉంది గనకనే దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టదల్చుకున్నాను' అనే జవాబు ఆవిడ దగ్గిర రెడీగా వుంటుంది.

అత్తగారితనమైనా అవధులంటూ దాటినప్పుడు అంతో ఇంతో ఎదురుగాలితప్పదు. ఆఫీసరుకాక ఆఫీసరుభార్యదే అజమాయిషీ అయింది గనక సాంబమూర్తికి ఉద్యోగంలో ఒన్ బై ఒన్ హెచ్చరికలూ అప్పుడప్పుడు కోతలూ వాతలూ కూడా తప్పలేదు. అతనికున్న సర్వీసుకి ఇలాంటివే లేకపోతే ఈపాటికి సియ్యో అయివుండును. ఎన్నోసార్లు రివర్షన్ అయింది ఉద్యోగంలో. ఒకటి రెండుసార్లు సస్పెన్షన్ ఆర్డర్సు వస్తే చచ్చీ చెడీ ఎలాగో మాట దక్కించుకున్నాడు. ఇప్పుడు ఈ తెలంగాణా మారుమూల జిల్లాకు వచ్చిన పనిష్మెంటు ఆర్డరు అలాంటిదే. అయితే దగ్గరుండి తమ నవలల్ని తామే బాన్ చేయించుకుని కొందరు రచయితలు ఇటీవల ప్రాచుర్యం పొందినట్టు ఆ ఆటవీ ప్రాంతంలో కూడా పంకజానికి కొల్లగొట్టుకునే సరుకు తక్కువేం కనబడలేదు. అయినా అది ఎమర్జన్సీ కాలం ఆధునిక వార్తా సౌకర్యాలున్న ఏ సిటీలో అయినా కేవలం కడిగిన జీతపు రాళ్ళే గతి. ఏదో సంసార పక్షంగా చెరో మేడా తలో లక్ష ఇచ్చి కూతుళ్ళనిద్దర్నీ కాపరానికిపంపింది కాని కొడుకు లిద్దరూ ఇంకా చదువుల్లోనే వున్నారు, పై ఊళ్ళలో కాలేజీలలో. వాళ్ళనీ మనుషులు చెయ్యాలంటే ఓ పక్కనుంచి మొగుడి సర్వీసు ఆయుష్షులా హరించుకుపోతోంటే ఇంట్లో ఆడది ఎన్ని చూసుకుంటే ఔతుంది! కత్తులయితే తిప్పగలరుగాని మొగాళ్ళు, ఆడాళ్ళదాళ్ళుగా ఎన్నిటిని అడ్డుకురావాలి! అలా డన్‌లప్ పరుపు మీద అటూ ఇటూ దొర్లుతూనే పంకజం ఎన్ని ఆలోచనలైనా చెయ్యగలదు. తన పూచీ లేకుండా కేవలం సంపాదించింది తెచ్చి అలా చేతిలో పెట్టేస్తే ఇక తిరుగులేకుండా ఇల్లు నడపగల ఆడదంటే కాదనడానికి సాంబమూర్తి వెర్రివాడేం కాదు. ఏదీ చదవకుండా ఎం. బి. యే.ని మించిన తెలివితేటలున్న పి. ఏ. లాంటి భార్యామణి ఎవరికి చేదు! అందుకే అయిన వాళ్ళనందర్నీ ఎప్పుడో అతను వద్దనుకున్నాడు. నెలకి నూరురూపాయలు పంపే తండ్రికి పెళ్ళాం వచ్చిన మూడో నెలకే కరవయి చేసేశాడు. తండ్రి పోయాక ఆ బాధా తీరిపోయింది. తల్లి ఇంకా చావలేదని విన్నాడు గాని ఎలా బతుకుతూందో కనుక్కోవాలని అతనికి తోచలేదు.

అతను చేసిన ఒకే ఒక్క మంచిపని

అంటూ ఉంటే ఆ పడిపోతున్న పెంకు టిల్లూ. దానిని ఆవరించి ఉన్న అర ఎకరం చింతతోపూ తల్లి పేర తండ్రి రాసేశాడని పంకజం అంత పవర్‌ఫుల్ లేడీ ముందు బొంకడం. తల్లి సంగతి తెలిసి చాలా ఏళ్ళు అయిందిగాని అంత రాత్మ పిసరు అనేది ఏదైనా ఉంటే తన పేర్న తండ్రి రాసిన ఆ ఆస్తిని తీసుకుని కన్న నేరానికి తల్లిని వీధిలో నిలబెట్టక పోవడమే.

తల్లి ఎలా ఉంటుందో సాంబమూర్తి మరచిపోయి చాలా రోజులయింది. అత నికి కావలసింది కట్టుకున్నది మొదలు తనని ఆకట్టుకున్న దాని మొహంలో చందమామ తొంగి చూడడమే. ఆ రోజు క్యాంపు నుంచి వచ్చాక, గంటపైగా బతిమాలాక, 'ఎమర్జన్సీ కాదు, దాని బాబు కాదు నిన్నెదిరించడానికి ఎవడి కెన్ని గుండెలే? నీ ఇష్టం వచ్చిన పని చెప్పు. చెయ్యకపోతే నీకు తోచిన శిక్ష వెయ్యి. ఎవడడ్డొస్తాడో నేనే చూస్తాను' అని మాట ఇచ్చాక మాత్రమే పంకజం మొహంలో మళ్ళీ నవ్వు పొడచూపింది. 'పాపిష్టిదాన్ని కడుపులో ఉంచుకోలేక నా బాధ వెళ్ళ గక్కుతూ కూచున్నాను. నాలుగురోజులై ఇల్లు వదిలారు. కళ్ళల్లో ఉన్నాయి ప్రాణాలు. పదండి పదండి ఎప్పుడనగా తిన్నారో' అని దగ్గిరిగా వచ్చి పమిట చెంగుతో మొగుడి మొహం తుడిచింది.

రెండురోజులయ్యాక మళ్ళీ సాంబ మూర్తి ఏదో మీటింగుకని హైదరాబాదు వెళ్ళినప్పుడు జరిగిన సంగతి

పంకజానికీ, పనివాళ్ళకీ పేచీ తెచ్చిన మూలకారణం చింతపండు. వేరింటి కాప రాలు వెలిగిస్తున్న కూతుళ్ళిద్దరికీ అన్ని టితో పాటు, ఏడాదికి సరిపడే చింతపండు సప్లయి పుట్టింటినుంచే కదా. పంకజంపున్న హౌస్ క్వార్టర్సుకి చాలా దగ్గిర్లోనే చింతల్ గూడా అని దట్టంగా చింతచెట్లున్న వన్యప్రాంతం ఉంది. అక్కడ చింత పండు కారు చవక. రూపాయికి అయి దారు కేజీలు ఇస్తూంటే వేవిధాల వాళ్ళని ఎక్స్ప్లాయిట్ చేసి పదికేజీలు చొప్పున తెప్పించింది పంకజం. కూతుళ్ళున్న పట్నాల్లో ఆ రోజుల్లోనే కేజీ మూడు రూపాయలు పలికేవి.

అనేక విధాల గవర్నమెంటు వయా దక్షిణ్యాలమీద ఆధారపడి ఉన్న ఏ ప్రైవేట్ లారీ ఓనరుకి చెప్పినా, అదో ఉపకారం చేసినట్లు భావించి, సరుకు గమ్యస్థానం చేరుస్తారు.

అందుకూ కాదు.

పిక్క తీయించడంలో వచ్చింది ఎక్కళ్ళేని కుస్తీ.

సర్కారు జిల్లా వాళ్ళలా అటువైపు వాళ్ళు కత్తిపీటతో పిక్క వేరుచేసి చింత పండుని పిడకసైజు దిమ్మల్లా అడలు చేసి దాచుకోరు. ఆ రాతి ప్రాంతంలో ఎండలు కూడా ఎక్కువగనక చింతబొట్ట దేనికది వేరుచేసి గచ్చుమీద లోపలపిక్క గలగల లాడేంత వరకూ ఎండబెడతారు. బొట్టని అడ్డంగా పట్టుకుని సుత్తితో కొడితే పిక్కలు వచ్చేస్తాయి. పరిశుభ్రమైన


1983 దీపావళి!

శ్రీవిజయలక్ష్మివారి నవ నవలా కుసుమాలు!

వాసిరెడ్డి సీతాదేవి. వెన్నెలమెరుస్తోంది. రూ. 12.00 | డా. పి. ఆనందరామం. మళ్ళువిడిపోయింది. రూ. 13.00

**కోడూరి సాంబశివరావు**
మల్లెలజల్లు ....... రూ. 14.00
ప్రేమమంజీరాలు ..... రూ. 14.00
స్వాతివాన ....... రూ. 12.00
రాగాలపల్లకి ....... రూ. 14.00
పారిజాతసుమం ..... రూ. 14.00
దీపిక ....... రూ. 15.00

**ఎన్. భారతీదేవి**
ఇదిప్రేమంటారా? / ఇదిపిచ్చంటారా? ... రూ. 12.00

**గిరిజశ్రీభగవాన్**
డాక్టర్ శివరామ్ ..... రూ. 13.00
సాంప్రదాయమా- / నీకుజోహార్లు ..... రూ. 13.00
ఆడంబరముమలా- / మీకుజేజేలు ..... రూ. 14.00
కథానాయకుడు కావాలి. రూ. 14.00

**లల్లాదేవి**
అగ్నిశిఖ ...... రూ. 10.00
కాలానికి నిలబడినకథ ... రూ. 14.00
ఒకేసూర్యుడు ..... రూ. 15.00

**యద్దనపూడి సులోచనారాణి**... 

**యర్రగడ్డ సరోజినీదేవి**
ప్రియబాంధవి ....... రూ. 13.00

**ఎం. డి. సౌజన్య**
స్వప్నతరంగాలు ....... రూ. 13.00

**కురుమద్దాలి విజయలక్ష్మి**
ఆశల ఆరాటం ...... రూ. 14.00

**యామినీసరస్వతి**
జీవనభాష్యం ....... రూ. 14.00

**బండారు లక్ష్మి**
శ్రమయేవజయతే ...... రూ. 10.00
(ఆంధ్రజ్యోతి సీరియల్)

ఏపుస్తకం కావలసినా, పుస్తకం విలువలో 1 రూపాయి తగ్గించి M.O. చేయండి. ఆ రూపాయికి V.P. ద్వారా పంపగలము

శ్రీవిజయలక్ష్మి పబ్లికేషన్స్ ఏలూరురోడ్. opp రహిమాన పార్కు విజయవాడ-520 002

FRIENDS.

చింతపండు తయారవుతుంది ఇలాంటి ప్రశస్తమైన పండు కుక్కి కుక్కి బాగా పెద్ద బస్తా నిండుగా, చెరోటీ పంపుదామని నిశ్చయించింది పంకజం.

అనుకున్నాక ఆచరణలో పెట్టకుండా ఉండడం ఆవిడవల్ల కాదు. నూటికి నూటపాళ్ళు మాతృ హృదయం ఆమెది. ఒక్క చిన్న పిక్కగాను సరికదా, వెంట్రుకంత ఈనెగాని, పిసరంత తొక్కగాని, చింతపండులో కల్తీ జరగటం సహించ లేదు. వంటచేసి, అంట్లుతోమి, బట్టలుతికి మొక్కలికి నీళ్ళుపోసి, పక్కలు వేశాక ముగ్గురంటే ముగ్గురున్నారే వీళ్ళకి రోజంతా ఏం పనుంటుంది గనక! భిక్షాలూ కొమరన్నా కాక యాదగిరి అని మూడోవాడు మరీ పని దొంగ ఇలా అని వెళ్ళిపోతే మరి కనపడ్డు దొంగ పీనుగ. ఓ పని చెబితే చెయ్యడానికి వందసాకులు. 'చేతులకి కాళ్ళకీ ఏవో కురుపులున్నాయంటాడు. ఎండలో పదిమాట్లు డాబా దిగి వస్తే కాళ్ళు మంటుతాయంటాడు. చింత పులుపు చేతిలోపడి మంటెక్కుతాయంటాడు. గీ కామ్ జేస్కాని జేస్కాని మన్ దుఃఖితవి అయితాది. సత్తా ఉన్నా. సుంట లెగిసి పేనం పోతా ఉండాది. అమ్మో రమ్మోరు నీ కాల్మొక్కుత. బాంచెన' అని యాదగిరి బతిమాలిన కొద్దీ పంకజం తాడెక్కిపోయింది. ఈ బాధ భరించలేక వాడు రెండు రోజులు సెలవు పెట్టేడు. ఇది వ్యక్తిగత అవమానంగా భావించింది పంకజం. మొగుడు ఇలా కాయమీద మీటింగుకి ఊరి పొలిమేర దాటాడోలేదో సెలవు పొడిగిస్తూ యాదగిరి నుంచి కాగితం వచ్చింది. అది ముందే ఊహించిన పంకజం సెలవు గ్రాంట్ చెయ్యబడనీ వెంటనే వచ్చి పన్లో చేరకపోతే పని ఉండదనీ మొగుడిచేత ముందే సంతకం చేసిన టైప్ లెటరు పుచ్చుకుని ఉంది. 'హమ్మమ్మమ్మ! ఎంత పొగరు ఎంత పొగరూ, 'కాసుకి గతిలేదు. నూటికి పరవాలేదు' అనే రకాలు! వీళ్ళకి బుద్ధి చెప్పడమే చెప్పడం' అనుకుని ఫోన్జేసి హెడ్‌క్లర్క్‌ని పిలిపించి యాదగిరిని పిలిపించింది. సగంరోజు గడిపేసి, మూడొంతులు పని పాడుచేసి వాడు బాగా ఎండ మండిపోయే వేళ. ఒంటిగంటా రెండూ మధ్య వచ్చేసరికి ఆమె భరించ లేకపోయింది. వాడివైపు చూడ్డానిక్కూడా అసహ్యం వేసింది. వీళ్ళిలా చేస్తారని తనకి తెలుసు. అందుకే ఆ బతుకులు అలా ఏడుస్తున్నాయి. అందుకే సమయం చూసి మొగుడి ముందు ఓ పొడి వేసింది.

'నా మాట ఏమీ వాళ్ళు లెక్కపెట్టడం లేదు. లీవ్ శాంక్షన్ చేయకపోయినా వాడొస్తాడని నాకు నమ్మకం లేదు. వస్తే మాత్రం చెప్పింది చేస్తాడని ఎక్కడుంది. మండుటెండలో బిల్డింగ్ చుట్టూ మూడు రౌండ్స్ కొట్టిస్తే వాడి పొగరు అణుగుతుంది.'

'నీ ఇష్టం వచ్చిన శిక్ష వెయ్యమని చెప్పానుగా!' అనే భర్త నోటి మాటతో తృప్తిపడలేక పోయింది పంకజం. 'అదేదో దాన్ని కాస్త టైపు చేయించి సంతకం చేసి మరీ వెళ్ళండి' అని పట్టుపట్టి కూచుంది తప్పని పరిస్థితిలో అలాగే కానిచ్చి 'ఆ వెధవ రాకపోతేకదా! వచ్చినా చెప్పినట్టు చెయ్యకపోతే కదా!' అనే ధైర్యంతో ఊరు దాటేశాడు సాంబమూర్తి.

ఇన్సబార్డినేషన్ అంటారు దాన్ని. అధికార ధిక్కారణ. అసలే అధికారం. ఆ పైన ఎమర్జెన్సీ కల్పించిన అదనపు హోదా. పదిగంటలకి రావలసినవాడు ఒంటిగంట దాటాక రాడంకన్న నేరం ఏముంది! కాళ్ళూ చేతులూ కట్లతో వాడు కుంటుకుంటూ వచ్చాడనైనా గమనించక 'డిసిప్లినరీ యాక్షన్' అమలుజేయించింది పంకజం. రాతినేల. నిప్పులుచెరిగే ఎండ. అరికాళ్ళు అదివరకే వాచిపోయి పుళ్ళు అయిపోయాయి. బిల్డింగ్ చుట్టూ మూడు రౌండ్స్ పరిగెత్తాలి.

పొట్టకోసం ఎన్నెన్ని నీచపు పనులు అయినా చెయ్యాలి.

ఒకసారి పడుతూ లేస్తూ ఏడుస్తూ తిట్టుకుంటూ పూర్తి చేశాడు.

రెండో రౌండు సగం. అంతే.

'అమ్మో' అని అరిచాడు.

మొహం తిరిగి పడిపోయాడు యాదగిరి.

కూడా ఉన్న భిక్షాలూ కొమరన్నా పెద్ద పెద్ద కేకలు వేశారు. క్షణంలో కూలి వాళ్ళంతా ఒకటైపోయారు. కర్రలు లేచాయి.

హెడ్‌క్లర్క్ మెరుపు స్పీడుతో పోలీసు స్టేషన్‌కు ఫోను చెయ్యబట్టి, అదైనా ఎమర్జన్సీ టైం కాబట్టి, ఎలాగో ప్రాణాలతో ఆ రాత్రికి రాత్రే పోలీసు జీపులో అత్తగారి పల్లెటూరువైపు బయలుదేరింది పంకజం. ఇంకా మీటింగ్‌లో అడుగు పెట్టకుండానే డిస్మిసల్ ఆర్డర్సు అందుకున్నాడు సాంబమూర్తి. అంతకు ముందే ఎక్కుపెట్టిన బాణాలలా ఎన్నో ఛార్జెస్ సిద్ధంగా వున్నాయి. సిద్ధం చేసుకుని వెళ్ళిన రెండు టైపు కాగితాలు అతని ప్రత్యర్థుల పని సులువుచేసి పెట్టాయి. ఇంతకీ వెంటనే ట్రీట్‌మెంట్ అభ్యమైన యాదగిరి కోలుకోవడం అతనికి ప్రాణభిక్ష పెట్టింది. సామాన్ల కోసమైనా అతనింక ఆ ఊరు వెళ్ళే అవకాశం లేదు. ఉద్యోగానికి సంబంధించిన కాగితాలు పోస్టులో తెప్పించుకోవలసిందే. కార్లో, బయల్దేరి దార్లోనే పెళ్ళాం దారి మళ్ళించాడు. 'మా అమ్మ ఈ మధ్యనే పోయిందిట' అనే రెండో మంచి అబద్ధం అది!

